ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025 5
శ్రీ సత్యసాయి



నాలుగు రైళ్లు దారి మళ్లింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో గుంతకల్లు, గుత్తి, ధర్మవరం రైల్వే స్టేషన్ల నడుమ అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా 4 రైళ్లను దారి మళ్లింపునట్లు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి బి.ఎల్.శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 16591/92 హుబ్బళ్లి మైసూర్ మధ్య నడిచే రైలు మే 11 నుంచి 17వ తేదీ వరకూ గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం మార్గంలో కాకుండా బళ్లారి, రాయదుర్గం, చిక్కజాజూరు, యశ్వంతపూర్ మార్గంలో నడుస్తుంది. 16531/32 బెంగళూరు (ఎస్‌బిసి)–అజ్మీర్ మధ్య నడిచే రైలు మే 12, 15వ తేదీ గుంతకల్లు, అనంతపురం, ధర్మవరం మార్గం లో కాకుండా యశ్వంత్‌పూర్, చిక్కజాజూరు, బళ్లారి, హుబ్బళ్లి మార్గంలో నడుస్తుంది. 16533 భగత్ కి కోఠి(జోధ్‌పూర్)–బెంగళూరు మే 14వ తేదీ హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు మీదుగా కాకుండా బళ్లారి, రాయదుర్గం, చిక్కజాజూరు, యశ్వంత్‌పూర్ మార్గంలో నడుస్తుంది. ప్రయాణికులు ఈ విషయాలను గమనించాలని శివకుమార్ సూచించారు.

శింగనమల

తమ్ముళ్ల బాహాబాహీ..!

◆ సెట్ అవ్వని శింగనమల సైకిల్



శింగనమల నియోజకవర్గం టిడిపిలో తమ్ముళ్ల మధ్య ఇప్పటికీ సయోధ్య కుదరలేదు. ఢీ అంటే ఢీ అంటూ ఒకరిపై ఒకరు తలపడుతున్నారు. గతంలోని ఘటనలను పునరావృతం చేస్తూ మరోమారు బాహాబాహికి దిగారు. ఏకంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ ఎదుటనే ఎమ్మెల్యే బండారు శ్రావణి, ప్రత్యర్థి వర్గాలు ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్నారు. ఈ పరిణామంతో ఒక్కసారిగా ఇన్‌ఛార్జి మంత్రి అసహనానికి గురయ్యారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిజెప్పి అక్కడి నుంచి పంపించాల్సి వచ్చింది.

◆ ఇన్‌ఛార్జి మంత్రి ఎదుటే పరస్పరం సవాళ్లు

◆ అనంత ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఘర్షణ



అనంత ఆర్‌అండ్‌బి వద్ద గుమిగూడిన శింగనమల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గంలో టిడిపి అధికారంలో లేనప్పటి నుంచి ఆ పార్టీ ముఖ్య నేతల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బండారు శ్రావణి ఉన్నప్పటికీ టుమెన్ కమిటీని వేశారు. ఈ గొడవల నడుమే ఆ నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యేగా బండారు శ్రావణి గెలుపొందారు. అదే విధంగా రాష్ట్రంలోనూ టిడిపియే అధికారంలో వచ్చింది. అయినా ఇప్పటికీ టుమెన్ కమిటీనే కాకుండా ఇతర నేతలతోపాటు, ఎమ్మెల్యే బండారు శ్రావణి మధ్య సయోధ్య లేదు. ఈ ప్రభావం ఆయా మండలాల్లోని నేతల మధ్య వరకు ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. ఒక గ్రూపునకు మరొక గ్రూపునకు మధ్య పొసగడం లేదు. దీంతో ప్రతి పనిలోనూ రెండు గ్రూపుల మధ్య తగాదాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలోనే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ పార్టీ సమావేశం కోసమని శుక్రవారం నాడు అనంతపురం నగరానికి విచ్చేశారు. ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్దకు నియోజకవర్గ నాయకులు విచ్చేశారు. ఎమ్మెల్యే బండారు శ్రావణికి వ్యతిరేకంగా ఆమె ఎదుటే ఇన్‌ఛార్జీ మంత్రి టిజి.భరత్‌కు ఫిర్యాదులు అందజేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కంటే ఆమె తల్లి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆమె పనిచేసిన కార్యకర్తలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎదురొడ్డి నిలబడి ఎంపిటిగా గెలుపొందిన తమకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని వెస్టునరసాపురం అంజనమ్మ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. యల్లనూరు మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లలో అన్యాయం చేసారంటూ వాసాపురం బాబు, అదే మండలానికి చెందిన బొప్పేపల్లి రవిల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అతిథి గృహం ఆవరణంలో పరస్పరం బాహాబాహీకి దిగారు. పోలీసులు ఇరువర్గాలను బయటకు పంపించారు. అక్రమ కేసులతో తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కణంపల్లి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా శింగనమల నియోజకవర్గంలోని గ్రూపు తగాదాలు శుక్రవారం నాడు బాహాటంగానే జరిగాయి. అయితే ఇప్పటికీ కూడా ఈ తగాదాలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మాత్రం ఇవి అన్నదమ్ముల మధ్య గొడవలేనని చెప్పడం గమనార్హం. మొత్తానికి శింగనమల నేతల మధ్య సయోధ్య ఎప్పటికి కుదేరేనోనని చూడాల్సి ఉంది.

'వక్ఫ్' సవరణ రాజ్యాంగ విరుద్ధం

◆ 'పురం'లో ముస్లిముల భారీ ర్యాలీ ◆ జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు



నడి రోడ్డుపై కుర్చోని ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు



వక్ఫ్ బిల్లు సవరణను వ్యతిరేకిస్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ముస్లిం మహిళలు

ప్రజాశక్తి-హిందూపురం

వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరణ చేస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని పలువురు ముస్లిములు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్‌సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలో జామీయ మసీదు కమిటీ ఆధ్వర్యంలో మసీదు ముతవల్లీలు, మైనార్టీ నాయకులు, వేలాది మంది ముస్లింలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అల్ హి లాల్ ఈద్గ మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ సద్భవన్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా సద్భవన్ సర్కిల్ వరకు కొనసాగింది. ర్యాలీలో 100 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ 'న్యాయాన్ని నిలబెడదాం, అన్ని వర్గాల గౌరవాన్ని కాపాడుకుందాం, భారతదేశం లౌకిక ప్రజాస్వామ్యాన్ని గౌరవిద్దాం' అంటూ నినాదాలు చేశారు. రోడ్డుపై కుర్చోని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింల నిరసనకు వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషా శ్రీ చరణ్, మాజీ ఎపి ఆగ్రోస్ ఛైర్మన్, మాజీ జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్, నియోజక వర్గ సమన్వయ కర్త దీపికా వేణురెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ముస్లింలను ఇబ్బందులకు గురి చేసేందుకు కేంద్రంలోని బిజెపి వక్ఫ్ సవరణ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ముస్లింల మతపరమైన, సాంస్కతిక, రాజకీయ, ఆర్థిక గుర్తింపును బలహీనపరిచేలా ఈ బిల్లులో అంశాలు ఉన్నాయన్నారు. ఈ చట్టం దేశంలోని అందరు మైనార్టీలకు నష్టదాయకం అన్నారు. ఇది ముస్లిములతోనే ఆగకుండా భవిష్యత్తులో ఇతర వర్గాలకు విస్తరించే ప్రమాదం ఉందన్నారు. భారత దేశ లౌకిక స్ఫూర్తిగా విఘాతం కలిగించే ఇలాంటి చట్టాలను చేయడం సరికాదని, తక్షణం దీనిని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జామీయ మసీదు ముతవల్లీ నూరూల్లా, కలీంతో పాటు వివిధ మసీదులో ముతవల్లీలు, ఇమామ్‌లు, ముస్లిములు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 9 గంటల నిరంతర విద్యుత్



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు

◆ 10వేల రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం

◆ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

◆ మడకశిర నియోజకవర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల ప్రారంభం

◆ పాల్గొన్న రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి-మడకశిర, అగళి, గుడిబండ

వ్యవసాయానికి సంబంధించి రైతులకు పగటిపూట 9 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మడకశిర నియోజకవర్గం మడకశిర రూరల్ మండలం వైబిహళ్లి గ్రామంలో.33/11కెవి, విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం, రొళ్ల మండలం రంగహళ్లి గ్రామంలో. 33/11 కెవి నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ, అగళి మండలం ఇనగలూరు గ్రామంలో. 33/11 కెవి విద్యుత్ నూతన సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారధిలి మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల అంజనప్ప, తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగహళ్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫ్‌టాప్ యూనిట్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. మడకశిర నియోజకవర్గం నాలుగు గ్రామాల్లో దాదాపు రూ.16 కోట్ల వ్యయంతో నాలుగు 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ నాలుగు ఉప కేంద్రాల పరిధిలోని 42 గ్రామాల్లోని 3299 మంది రైతులకు పగటిపూట తొమ్మిది గంటలు నిరంతరాయ విద్యుత్ సరఫరా, 10,319 మంది ఇతర విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. మడకశిర మండలం గుండుమల, రొళ్ల మండలం రంగనపల్లి, గుడిబండ, కేకే పాల్యంలో రూ.12 కోట్లతో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేంద్ర, ఈఈ భూపతి, మడకశిర ఇంజినీర్ రఘు, ఆర్డీవో ఆనంద్ కుమార్, మడకశిర నియోజకవర్గం ప్రత్యేక అధికారి సూర్యనారాయణ రెడ్డితో పాటు ఆయా గ్రామస్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండేళ్లలో పెనుకొండ వైద్య కళాశాల పూర్తి

మంత్రి సత్యకుమార్ యాదవ్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం 10 వైద్య కళాశాలలను పిపిపి(ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య) విధానంలో నిర్మించాలని నిర్ణయించిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి జిల్లాకు ఓ వైద్య కళాశాల అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో కేంద్రం రాష్ట్రానికి 17 కొత్త వైద్య కళాశాలలు మంజూరు చేసిందన్నారు. వాటి ఏర్పాటు ప్రభుత్వ రంగంలోనా, ప్రయివేటు రంగంలోనా అనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేసిందన్నారు. దీంతో గత ప్రభుత్వం నాబార్డ్, కేంద్రం నిధుల్లో నుంచి రూ. 8,800 కోట్లకు గానూ రూ. 2,100 కోట్లు ఖర్చు పెట్టిందని, అందులో కాంట్రాక్టర్లకు రూ. 1400 కోట్లు చెల్లించి పనులను అసంపూర్తిగా వదిలి వెళ్లిందన్నారు. సొంతంగా ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదని, నాలుగేళ్లలో ఒక్క కళాశాలను పూర్తి చేయలేదన్నారు. పెనుకొండలోనూ అసంపూర్తిగా వదిలేసింద న్నారు. కూటమి ప్రభుత్వం 10 వైద్య కళాశాలలను పిపిపి విధానంలో నిర్మించి, 33 ఏళ్ల పాటు లీజు ప్రాతిపదికపై ప్రయివేటు సంస్థలకు అప్పగిస్తామన్నారు. అందులో నాణ్యమైన వైద్య సేవలను అందిం చటం అత్యంత ప్రధానమైన షరతు అని వివరించారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటుందన్నారు. పెనుకొండ వైద్య కళాశాలను రాబోయే రెండేళ్లలో పూర్తి చేసి అన్ని వసతులతో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి స్పష్టం చేశారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందజేస్తున్న మంత్రి సవిత

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

ప్రజాశక్తి-పెనుకొండ


నిరుపేద ఇంజినీరింగ్ విద్యార్థులకు శుక్రవారం మంత్రి సవిత పట్టణంలోని తన కార్యాలయంలో ల్యాప్‌టాప్‌లు అందజేసింది. రొద్దం మండలంలోని శ్యాపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త గొల్ల రాము కుమార్తె మానస ప్రకాశం జిల్లా మార్కాపురంలో బి.టెక్ చదువుతోంది. అలాగే దందేపల్లి గ్రామనికి చెందిన అంజనప్ప కుమార్తె పూర్ణిమ బి.టెక్ చదువుతోంది. వారి విద్యాభ్యాసానికి ల్యాప్‌టాప్ అవసరమైనా కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేకపోవడంతో మంత్రి సవితని ఆశ్రయించారు. స్పందిం చిన మంత్రి సొంత నిధులతో ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారిద్దరికీ ల్యాప్‌టాప్‌లు అందజేసింది. బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వారికి మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత

ప్రజాశక్తి-రొద్దం

బెంగళూరుకు చెందిన విద్య ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఫర్ ఉమెన్ అడల్ట్స్, గీత హ్యాండ్ క్రాఫ్ట్ స్టూడియో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ముందుకొచ్చాయి. ఆయా కంపెనీల సహకా రంతో స్థానికంగా ఉంటున్న బీడీ కార్మికులు, నిరుపేద మహిళలను స్వయం సహాయక బృందాలుగా ఏర్పరిచి వారికి ధూప్ స్టిక్స్, తదితర గృహోపకరణాల తయారీలో శిక్షణ ఇచ్చి వారికి స్వయం ఉపాధి కల్పిస్తాయి. ఇలాంటి మరిన్ని కార్యక్రమాలతో ముందుకు రావాలని మహిళలు కంపెనీ నిర్వాహకులను కోరుతున్నారు.

మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య

ప్రజాశక్తి-పెనుకొండ

మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య తెలిపారు. మండలంలోని గుట్టూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన మాజీ సర్పంచి సూర్యనారాయణతో కలిసి ప్రారంభించారు. కేశవయ్య మాట్లాడుతూ మహిళల్లో ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభించిందన్నారు. మహిళలకు 3 నెలల పాటు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్ అందిస్తారని వివరించారు. శిక్షణకు హాజరయ్యే మహిళలు ప్రతి రోజూ క్రమం తప్పకుండా వచ్చి నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కనీసం 75 శాతం హాజరు ఉంటే మహిళలకు శిక్షణ చివరి రోజున కుట్టు మిషన్ ఉచితంగా ఇస్తారన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వం కూడా మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలను మహిళల పేరు మీదనే అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, బోయ రామకృష్ణ, వడ్డే పల్లవరాజు, తదితరులు పాల్గొన్నారు.

పగిలిన ఆర్టీసీ బస్సు టైరు.. తృటిలో తప్పిన ప్రమాదం..

ప్రజాశక్తి-రొద్దం

పెనుకొండ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సుకు శుక్రవారం తృటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. పెనుకొండ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు మధ్యాహ్నం పావగడ వైపు నుంచి పెనుకొండకు వెళుతుండగా రొద్దం, మరవపల్లి గ్రామాల మధ్యలో ఉన్న ఓ కల్వర్టుపైకి రాగానే ముందు టైరు పగిలి పోయింది. దీంతో బస్సు కల్వర్టు దాటిన అనంతరం రోడ్డుకు కుడివైపు వెళ్లింది. అయితే ఆ సమ యంలో ఎదురుగా, వెనుక నుంచి వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమ యంలో బస్సులో 28 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్ ఊపిరి పీల్చుకొన్నారు. ఆ తర్వాత అర్ధ గంటైనా మరో బస్సు రాకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే పడిగాపులు కాచారు. ఇకనైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి టైర్లతో కండిషన్‌లో ఉన్న బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టైరు పగలడంతో నిచిచిపోయిన ఆర్టీసీ బస్సు



బిసిలు ఐక్యతను చాటుకోవాలి : మంత్రి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

హక్కుల సాధనం కోసం బిసిలు ఐక్యతను చాటుకోవాలని, అప్పుడే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన సంకారపు జయశ్రీ నియమితులైన సందర్భంగా శుక్రవారం పట్టణంలోని పోలా ఫంక్షన్ హాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరవగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకర్రావు, విశ్రాంత ఐపిఎస్ చిరంజీవి, జిల్లా అధ్యక్షులు నామాల శంకర్, రాష్ట్ర నాయకులు క్రాంతి కుమార్, ఎపి స్వీట్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు సుధాకర్ హాజరయ్యారు. తొలుత మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ హక్కులపై పోరాట స్ఫూర్తిని చైతన్య పరచాలన్నారు. ఐక్యంగా ఉన్నప్పుడే ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సంఖ్యాబలం పెంచుకోవచ్చున్నారు. గత వైసిపి ప్రభుత్వం బిసి సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ బిసిలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దే అన్నారు. బిసిలంతా ఏకమైతేనే ఏ సమస్యనైనా సాధించుకోగలు గుతామన్నారు. అనంతరం సంకారపు జయశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గిర్రాజు రవి, పోలా ప్రభాకర్, డాక్టర్ వివేక్ కుళ్లాయప్ప, ఆదినారాయణ యాదవ్, ముత్తుకూరు బీబీ, నాగూర్ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

సచివాలయాల్లో పని చేస్తున్న విద్యా కార్యదర్శులను విద్యాశాఖలో విలీనం చేయాలని యూనియన్ నాయకులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కోరారు. మడకశిర నియోజకవర్గంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రులను శుక్రవారం వార్డు విద్యాశాఖ కార్యదర్శుల సంఘం నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వార్డు విద్యా కార్యదర్శుల సంఘం నాయకులు అశ్వర్థ, శ్రీనాథ్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబా జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించండి

మంత్రికి ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీసత్య సాయిబాబా శత జయంత్యుత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇచ్చేలా చూడాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. మడకశిర నియోజకవర్గ పర్యటనకు వచ్చిన మంత్రిని శుక్రవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్‌లో బాబా శత జయంతి వేడుకలు జరుగుతాయని, ఆ వేడుకలకు దేశ విదేశాల నుంచి పది లక్షలకు పైగా భక్తులు వస్తారని తెలిపారు. అభివృద్ధి పనులకు సుమారు రూ.885 కోట్లు అవసరమవుతాయని, జిల్లా అధికారులు ఇచ్చిన అంచనా మేరకు నిధులు మంజూరయ్యాలా చూడాలని కోరారు. మంత్రి స్పందిస్తూ ప్రభుత్వం ఇప్పటికే రూ. 100 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకుందని మరో రూ. 100 కోట్లను కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.నియోజకవర్గంలో కొత్తగా 5 సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు.

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-మడకశిర



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ కార్మికులు

విద్యుత్ మీటర్ రీడర్స్‌కు విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ శుక్రవారం మీటర్ రీడర్స్ విద్యుత శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మీటర్ రీడర్స్ మాట్లాడుతూ అదానీ సంస్థ రీఛార్జి స్మార్ట్ మిటర్లు బిగించడం వల్ల తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున తమకు విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రాన్స్‌కో ఖాతా ద్వారా వేతనాలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టర్ 3 నెలలుగా వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. వారిలో బి.దస్తగిరి, ఉమ్మడి అనంతపురం జిల్లా మీటర్ రీడర్స్ యూనియన్ కోశాధికారి సలీంబాషా, రాష్ట్ర నాయకులు బాబా, మండల అధ్యక్షులు లోకి, మహబూబ్‌బాషా, నార్పల కిశోర్ నాయుడు ఉన్నారు.

విద్యుత్ సమస్యపై ధర్నా

కొత్తచెరువు : మేజర్ గ్రామ పంచాయతీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు శుక్రవారం స్థానిక విద్యుత్‌సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ వేళాపాళ లేని విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రధానంగా లోవోల్టేజీతో తీవ్ర సమస్య తలెత్తుతోందన్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. స్పందించిన ఎడి రామిరెడ్డి మాట్లాడుతూ కొత్తచెరువులో ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువగా ఉన్నందున లోవోల్టేజీ సమస్య ఉందన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌పై హర్షం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం ఆర్డినెన్స్ జారీ చేయడంపై మాదిగ ఉద్యోగులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో కేక్ కోసి సంబరాలు జరుపు కున్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్య సాధనకు కేంద్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి సహకరించిన భారత ప్రధాని మోడీకి, ఆంధ్ర ప్రదేశ్ లో అర్డినెన్స్ రావడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి, జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , కదిరి నియోజక వర్గ శాసనసభ్యులు కంది కుంట వెంకట ప్రసాద్‌కి గారికి కృత్జతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎఫ్ జాతీయ నాయకులు ఆనంద్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పలక నాగరాజు, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు జయరాం, ఎంఇఎఫ్ కదిరి నియోజకవర్గ నాయకులు శ్రీనివాసులు, చిన్నప్పయ్య, నాగప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



బత్తలపల్లిలో నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

ముస్లిం మైనార్టీలకు నష్టం కలిగించే వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సంయుక్త మస్జిద్ కమిటీ, బత్తలపల్లి ముస్లిం మైనార్టీ సోదరులు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.శుక్రవారం బత్తలపల్లిలోని జామియా మసీదు నుండి వందలాదిమంది ముస్లింలు నల్ల జెండాలు,జాతీయ జెండా,నల్ల రిబ్బన్లు ధరించి వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కూడలిలో మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా,వక్ఫ్ చట్ట సవరణకు మద్దతు తెలిపిన పార్టీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముస్లింల నిరసన ర్యాలీకి సిపిఐ ఎంఎల్ నాయకులు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి,ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు మద్దతు పలికారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా ముస్లింల ఆధ్వర్యంలో భారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ముత్తవల్లి ఇస్మాయిల్, కార్యదర్శి ఎల్ ఎస్ సుభహాన్,మదీనా మౌలా, మాజీ ముత్తవల్లి కరీం సాహెబ్,నడిమింటి షేక్షావలి,అంజన్ రెడ్డి మౌలా,సత్తార్ సాబ్, జిలాని,ముస్తఫా,మక్బూల్, ప్లాట్ల జిక్రియా,ప్లాట్ల కాలా మహబూబ్ బాషా,షాషు, బాబ్జాన్,టైలర్ బాబా, ఎలక్ట్రికల్ భాష,టైలర్ రియాజ్,చికెన్ దాదా, మున్నా తదితరులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం : ముస్లింలకు నష్టం కలిగించే వక్ఫ్ చట్ట సవరణ వ్యతిరేకిస్తూ,కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి ముస్లిం నాయకులు పాలాభిషేకం నిర్వహించారు.శుక్రవారం బత్తలపల్లిలో ముస్లిం నేతలు షేక్ షాషు,షేక్ కరీం సాబ్,షేక్ జిలాని సాబ్, నడిమింటి షేక్షావలి,చికెన్ దాదా,మున్నా తదితరులు వైసీపీ అధినేత జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ధర్మవరం రూరల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదలచిన కొత్త వక్ఫ్ సవరణ చట్టం 2024కు వ్యతిరేకంగా ధర్మవరం పట్టణంలో శుక్రవారం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ముస్లిం మైనారిటీలు రిలేదీక్షలు కొనసాగిస్తున్నారు. ఈ దీక్షలకు ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ యం యం డి ఎ సభ్యులు మద్దతు తెలిపారు ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రోషన్ జమీర్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన జీవోలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎండిఎ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రోషన్ జమీర్, నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ దాదా పీర్, ధర్మవరం పట్టణ అధ్యక్షుడు ముల్లా ఫారుక్, సభ్యులు షాషావలి, ఇనాయత్ తుల్లా, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మరో ముగ్గురికి గాయాలు



మృతుడు ఓబులేసు

ప్రజాశక్తి బత్తలపల్లి

అడవి పందుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు ఓ రైతు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు తగిలి ఒకరు మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి మండలం ఎం. చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, ట్రాన్స్‌కో అధికారులు తెలిపిన వివరాలు... ఎం. చెర్లోపల్లికి చెందిన కేశవనాయుడు బత్తలపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగు చేశాడు. అడవి పందులు పంటను నాశనం చేస్తున్నాయని జీఏ వైరుతో పొలం చుట్టూ విద్యుత్ సరఫరా ఇచ్చాడు. అయితే గొర్రెల కాపర్లు జీవాలను తీసుకురావడం వల్ల ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని నాలుగు రోజుల క్రితం పొలం చుట్టూ ఉన్న విద్యుత్ వైరును తొలగించాడు. కాని విద్యుత్‌స్తంభం నుంచి పొలం వరకు వేసిన వైరును అలాగే ఉంచాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ గుడ్డలు ఉతికేందుకు అటుగా వెళ్లింది. ఆమె వెంట ఆమె కుమారుడు కూడా వెళ్లాడు. విద్యుత్ తీగ గురించి ముందే అప్రమత్తమైన లక్ష్మి కుమారుడిని కాపాడుకునేందుకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురైంది. ఆ సమయంలో ఆమె బిగ్గరగా అరవడంతో ఆమెను కాపాడేందుకు అక్కడే ఉన్న ఓబులేసు (60) అనే వ్యక్తి వెళ్లాడు. ఆమెను కాపాడే క్రమంలో అతను షాక్‌కు గురై కిందపడ్డాడు. అది గమనించి ఓబులేసు భార్య లింగమ్మ తన భర్తను కాపాడేందుకు ప్రయత్నించి షాక్‌కు గురైంది. వెంటనే వారి కుమారుడు నాగభూషణ కర్ర తీసుకుని విద్యుత్‌వైరును కొట్టాడు. ఆ సమయంలో నాగభూషణ కూడా షాక్‌కు గురై కిందికి పడ్డాడు. ఈ ఆర్థనాదాలను విన్న గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి వెంటనే ట్రాన్స్ ఫార్మర్ వద్దకు చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. షాక్‌కు గురై స్పృహ కోల్పోయిన లక్ష్మి, ఓబులేసు, లింగమ్మ, నాగభూషణను వెంటనే బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి రతలించారు. అక్కడ చికిత్స అందించేలోపు ఓబులేసు మృతిచెందాడు. మిగిలిన ముగ్గురునిమెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఎఇ శివయ్య గ్రామానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన రైతు కేశవనాయుడు పొలానికి అక్రమంగా విద్యుత్ తీసుకుని అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు కంచె ఏర్పాటు చేసుకున్న నేపథ్యంలో ఈ సంఘటన చోటు చేసుకుందన్నాను అదేవిధంగా బత్తలపల్లి ఎస్ ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను ప్రత్యక్షసాక్షులతో ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణ కోలా

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో ఔత్సాహిక దళిత పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి ప్రత్యేక ప్రోత్సహకాలు ఇవ్వాలని దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (డిక్కీ) రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ వెంకట రమణ కోలా కోరారు. ఈ మేరకు గురువారం 17న 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ అరవింద్ పనగరియా, కమిటీ సభ్యులతో తిరుపతి కలెక్టరేట్ లో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. కమిషన్‌బృందంతో చర్చించిన పలు అంశాలపై శుక్రవారం పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికంగా దళితులను ప్రోత్సహించడానికి అనేక అంశాలతో కూడిన ప్రతిపాదనలు కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ముఖ్యంగా ఐదు ప్రధాన అంశాలపై కమిషన్ ఛైర్మన్‌తో చర్చించామన్నారు.అందులో మొదటి అంశం దళిత పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక వ్యాపార, నిరుద్యోగ యువత పారిశ్రామికంగా స్థిరపడాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం కీలకమన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం సూచనలతో ఎస్సీ ఎస్టీ వర్గాలకు ప్రోత్సాహం లభిస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్రెడిట్ లింక్డ్ ఇన్వెస్టమెంట్ సబ్సిడీని 25శాతం నుండి 45శాతానికి పెంచాలని ఆయన సూచించారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక గ్రాంటు ఇస్తున్న తరహాలోనే ఎస్సి ఎస్టీ వర్గాలకు ప్రత్యేక పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న క్రెడిట్ గ్యారెంటీ పథకాన్ని అమలు చేయడంలో వాణిజ్య బ్యాంకులు నిరాదరణ చూపుతున్నాయని, దాన్ని సక్రమంగా అమలు జరిపించి మొదటి తరం దళిత పారిశ్రామిక వేత్తలకు ఆర్థిక భరోసా కల్పించి వికసిత భారత్ లో సుస్థిర స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ సిబ్బంది సూచించారు. అగ్నిమాపక ప్రమాదాలు వాటి నివారణ పై పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని అగ్నిమాపక అధికారి యు.రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని హెచ్ పి పెట్రోల్ బంకు, మామిళ్ళపల్లి క్రాస్ సమీపంలో గల కే ఎఫ్ సి ఫుడ్ ప్లాజా వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్ సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో తూముకుంట పారిశ్రామిక వాడలోని ఎక్సెల్ రబ్బర్ కంపెనీలో కార్మికులకు, సెక్యూరిటీ సిబ్బందికి అగ్ని ప్రమాదాలు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, హెచ్‌ఆర్ రవీందర్ రెడ్డి, కార్మికులు , అగ్నిమాపక కేంద్రం ఉద్యోగులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారులు ప్రజలకు మహిళలకు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని సిద్ధార్థ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ, భారత్ పెట్రోల్ బంక్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించి వారోత్సవ కరపత్రాలు అందజేశారు. గ్యాస్ ప్రమాదాలు అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శ్రీధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మంటలు ఆర్పే విధానాన్ని వివరిస్తున్న సిబ్బంది

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్


అఖిల భారత పోస్టల్ గిరిజన ఉద్యోగుల ఆత్మీయ సాంస్కృతిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర కన్వీనర్ బి. రామా నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని డివిజనల్ పోస్టల్ కార్యాలయంలో ఆ సమ్మేళనానికి సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే నెల 4న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సమ్మేళనం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డివిజనల్ పోస్టల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను సమాయాత్తం చేయడానికి పర్యటిస్తున్నామన్నారు. ఆ సమ్మేళనంలో గిరిజన ఉద్యోగుల సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. గిరిజన ఉద్యోగులే కాకుండా పోస్టల్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను కూడా చర్చించి భవిష్యత్తు కార్యచరణ కార్యక్రమాలు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ

రాష్ట్ర కన్వీనర్ బి. రామా నాయక్

కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ గోపి రావు, హిందూపురం డివిజనల్ కార్యదర్శి రామాంజనేయులు, శ్రీనివాసులు, పుట్టపర్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెంట్ కళ్యాణ్ రామ్, పోస్టల్ ఉద్యోగి అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు పత్రాన్ని అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్




గిన్నిస్ రికార్డు పత్రాలతో విద్యార్థులు, ప్రముఖులు

శ్రీ లలిత కళానికేతన్ గురువు బాపూ బాలాజీ శిష్య బృందం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నమోదు చేసుకుంది. హైదరాబాదులో 2023లో భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన నృత్య ప్రదర్శనలలో పాల్గొని పేర్లు నమోదు చేసుకున్న వారికి శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా తన కార్యాలయంలో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ పత్రాలను అందజేశారు. ఈ పత్రాలను 12 మంది విద్యార్థులు మంత్రి చేతుల మీదుగా అందుకున్నారు. వారిలో ముఖ్యంగా గోరంట్ల ఉదయ్ కిరణ్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న మైలారం వేద ప్రజ్ఞ, గోరంట్లకు చెందిన తనూ లత ,ఉమా ప్రియ, ధర్మవరానికి చెందిన రామ లాలిత్య, హాసిత, లీలా మాధు రీ, వైష్ణవి, ఆదిత్రి, ఉదయశ్రీ, సహస్ర ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను శాలువాతో సత్కరించి, మెడల్ ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యతోపాటు కళా రంగంలో కూడా ప్రతిభ సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. అనంతరం కార్యాలయంలోనే విద్యార్థుల నృత్య ప్రదర్శనను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నృత్య గురువు బాపు బాలాజీని మంత్రి ఘనంగా సత్కరించారు.

అదానీ కంపెనీ ఎదుట రైతుల నిరసన

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని దాడి తోట చిల్ల కొండయ్య పల్లి పెద్దకోట్ల గ్రామ సరిహద్దుల్లో చిత్రావతి రిజర్వాయర్ నందు నిర్మిస్తున్న అదాని హైడల్ పవర్ ప్రాజెక్టు వద్ద దాడి తోట గ్రామ రైతులు శుక్రవారం ధర్నా చేశారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఏర్పడిన ధూళి కాలుష్యంతో పంటనష్టపోయిన తమకు పరిహారం అందజేయడంలో అన్యాయం జరిగిందని విమర్శిస్తూ ఆందోళనకు దిగారు. అధికంగా పంట నష్టపోయిన రైతులు కంటే పంట నష్టం లేని రైతులకు ఎక్కువ మోతాదులో డబ్బులు చెల్లించారని పలువురు రైతులు ఆందోళకు దిగారు. దీంతో అదాని కంపెనీ యాజమాన్యం రైతులతో చర్చలు జరిపింది. తమకు తగిన పంట నష్ట పరిహారం చెల్లించడం లేదని మహిళా రైతు లక్ష్మీదేవి వాపోయింది. అధికారులు నాయకులు కలిసి రైతులను మోసగిస్తున్నారని ఆరోపించింది.



నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత రైతులు

నేరాలు ఘోరాలు

వరకట్న వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరి పట్టణం నిజాంవలి కాలనీకి చెందిన షేక్ మెహతాజ్, కర్ణాటక రాష్ట్రం గౌనిపల్లి కి చెందిన షేక్ అబ్దుల్ నబికి 8 సంవత్సరాలు క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్న కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం ఈ దంపతులు నిజాంవలి కాలనీలో కాపురం పెట్టారు. అబ్దుల్ నబి టు వీలర్ మెకానిక్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి ఇద్దరు కుమారులు కలిగారు. ఈ నేపథ్యంలో అబ్దుల్ నబి ప్రతి రోజూ మద్యం తాగి వచ్చి భార్యను వేధించేవాడు. అతనితో పాటు అతని తల్లిదండ్రులు జరీనా, మస్తాన్, సోదరి యాస్మిన్ తరచూ మెహతాజ్‌కి ఫోన్‌చేసి బెదిరించేవారు. అదనపు కట్నం తీసుకుని రావాలని లేక పోతే మరో పెళ్లి రెండో పెళ్లి చేస్తామని బెదిరించేవారు. దీంతో బాధితురాలు తన భర్త, అత్త, మామ, ఆడపడచుపై వరకట్నం వేధింపుల కింద ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.

గుప్త నిధుల కోసం క్షుద్రపూజలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోనిగౌకనపల్లి ప్రభుత్వ పాఠశాల వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం క్షుద్ర పూజలు చేశారని గ్రామస్తులు తెలిపారు. పాఠశాల ఉన్న ప్రాంతంలో గతంలో శ్రీకృష్ణదేవరాయలు కోట కట్టించారని, ఈ కోట గౌతాపూరిపట్టణంగా వెలుగొందిందని, సామంతులు ఇక్కడి నుండి పరిపాలన సాగించేవారని చరిత్ర చెబుతున్న నేపథ్యంలో ఇక్కడ గుప్త నిధులు ఉంటాయని భావించి క్షుద్రపూజలు చేసినటుల గ్రామస్తులు తెలిపారు. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం ఇళ్ల నిర్మాణాలకు త్రవ్వకాలు చేపట్టినప్పుడు సొరంగ మార్గాలు బయటపడ్డాయని, ఇనుప కుండ, కోట రక్షణకు ఉపయోగించే బరిసె, ఖడ్గం బయటపడ్డాయని తెలిపారు. ఈ గ్రామం చెరువు కట్టపై పురాతన దుర్గమ్మ గుడి, శివాలయం ఉందని గుప్త నిధుల కోసమే ఈ క్షుద్ర పూజలు చేసివుంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ రకమైన పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయని తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

నల్లమాడ మండలం బడవాండ్లపల్లి గ్రామం శివారు ఊర్లబావి ప్రాంతంలో పేకాట స్థావరంపై నల్లమాడ సిఐ నరేందర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురుని అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. వారి వద్ద నుండి మూడు ద్విచక్ర వాహనాలు రూ.51,520, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవోదయం 2.0 లో భాగంగా సిఐ చంద్రమణి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ధర్మవరం మండలంలోని నేలకోట తండా, ఓబుళనాయునిపల్లి తండాలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. నేలకోటతండాలో ఖత్రోత్ డుంది బాయ్ అనే మహిళ దగ్గర 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఓబుళనాయునిపల్లి తండా కొండ ప్రాంతం లో 120 లీటర్లు నాటు సారాయి తయారీకి ఉపయోగపడే పులియబెట్టిన వాష్‌ను ధ్వంసం చేసి ఓబుళనాయనిపల్లె కు చెందిన కిరణ్ నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడులలో పుట్టపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందా నాయక్, ఎస్ఐ చాంద్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుతో పాడిఆవు మృతి

ప్రజాశక్తి - నల్లచెరువు

మండల పరిధిలోని పూలకుంట ఎస్సీ కాలనీలో రైతుకు చెందిన పాడిఆవు పిడుగుపాటుకు మృతిచెందింది. శుక్రవారం చిన్నపాటి వర్షంతో ఉరుములు, మెరుపులు వచ్చాయి. ఈ సమయంలో కాలనీకి చెందిన రైతు సుధాకర్‌కు సంబంధించిన పాడి ఆవు పిడుగుపాటుకు మృతిచెందింది.

సమిష్టి పోరాటాల ఫలితం.. తాలూకాకు తుంగభద్ర నీరు..!

ప్రజాశక్తి-పావగడ

సమిష్టి పోరాటాల ఫలితంగానే తాలూకాకు తుంగభద్ర నీరు రానున్నాయని సమగ్ర జల పోరాట వేదిక అధ్యక్షుడు శివప్రసాద్ తెలిపారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫ్లోరైడ్ నీరు తాగడం వల్ల తాలూకా ప్రజలు రోగాల బారిన పడేవారన్నారు. దీంతో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అనేక సంస్థలు, రాజకీయ పార్టీలు చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా నేడు తుంగభద్ర నుంచి తాలూకాకు నీరు రాబోతున్నా యన్నారు. తాలూకాకు తాగునీటిని తెచ్చేందుకు అన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు, సంస్థలు, నాయకులు తమదైన శైలిలో పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారన్నారు. మీడియా కూడా కీలకపాత్ర పోషించిందన్నారు. తాలూకాకు తుంగభద్ర తాగునీటిని తీసుకురావడానికి కృషి చేసిన అన్ని సంఘాల పోరాటయోధులను ఈ నెల 21వ తేదీ సన్మానిస్తున్నట్లు తెలిపారు. రైతు సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ తాలూకాలో నీటి సమస్య పెరుగుతోందని, తాగు, సాగునీరు కోసం పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెడిఎస్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పురుషోత్తమరెడ్డి, జెడిఎస్ అధ్యక్షుడు రాజశేఖర్, గిరీష్, రామంజి, హసిరు సేన జిల్లా అధ్యక్షుడు పూజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా స్పందించరా..?

ప్రజాశక్తి - నల్లచెరువు

సిపిడబ్ల్యూఎస్‌లో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వర్కర్లకు 2019 సెప్టెంబర్ వరకు వచ్చిన వేతనాలు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని ఈ విషయంపై సిఎం కార్యాలయానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని బాధిత కార్మికులు వాపోతున్నారు. మంజూరైన వేతనాలను వైసిపి ప్రభుత్వంలో ఆ కాంట్రాక్టర్ ఇవ్వలేదన్నారు. ఐదు సంవత్సరాలుగా బిల్లులు చేయించుకుని శ్రీ లక్ష్మీనరసింహ మెటల్ ఇండస్ట్రీ అనే లబ్ధిదారుడు లబ్ధి పొందాడని ఆరోపించారు. అయితే అగ్రిమెంట్ ప్రకారం వర్కర్స్ కు జీతాలు పిఎఫ్ కట్టిన తర్వాత ఆ ప్లేస్ స్లిప్పులను సంబంధిత ఏఈ కి గాని ఇతర అధికారులకు గానీ ఇచ్చి రికార్డ్ చేయించి మిగతా బిల్లులు మంజూరు చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. దీనికి విరుద్ధంగా ఇవేవీ పట్టించుకోకుండా అడ్డగారిలో వెళ్లి వారికి రావలసిన బిల్లులతో చేయించుకున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇది సరైన పద్ధతి కాదన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు, డిప్యూటీ సీఎం, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఫిర్యాదు చేశామన్నారు. ఇది జరిగిన తర్వాత కొంతమంది వర్కర్లు ఫోటోలు అధికారులకు చూపించి భారీ మొత్తంలో బిల్లు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించి వేతనాలు అడిగితే 'మీ చేతనైతే ఎవరికైనా చెప్పుకోండి' అంటూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని వాపోయారు. గతంలో పనిచేసిన ఇద్దరు కాంట్రాక్టర్లు నుంచి డైలీ వర్కర్స్ కు రావలసిన వేతనాలు, పిఎఫ్ సొమ్ము చెల్లించాలని 2019 నుండి 2021 వరకు రావలసిన మొత్తాన్ని ఇప్పించి తమకు న్యాయం చేయాలని సిపిడబ్ల్యూఎస్ వర్కర్లు కోరుతున్నారు.

దర్గా కమిటీ అధ్యక్షులుగా మాణిక్యం బాబా

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి దర్గా, సంబంధిత మసీదులు ఈద్గా బరియల్ గ్రౌండ్ తదితర ఆస్తుల పరిరక్షణకై రాష్ట్ర వక్ఫ బోర్డ్ టిడిపి మైనారిటీ నాయకుడు మాణిక్యం బాబాను దర్గా కమిటీ అధ్యక్షులుగా నియమించింది. ఈ నేపథ్యంలో మాణిక్యం బాబా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆ యనతో పాటుఎనిమిది మంది కార్యవర్గ కమిటీ సభ్యులు కొత్తచెరువులోని హజరత్ మస్తాన్వలి దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు.